క్లుప్తంగా

పెనుగంచిప్రోలు పార్కులో సందడి



పెనుగంచిప్రోలు: గ్రామంలో చెరువుకట్ట వద్ద రూ.కోటితో ఏర్పాటు చేసిన స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను–విమల పేరు మీద ఏర్పాటు చేసిన ఉద్యానవనం గ్రామస్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. సాయంత్రం వేళలో పిల్లలు పెద్దలతో కలిసి వచ్చి ఊయల ఊగుతూ, జారుబండ మీద జారుతూ, ఆటలు ఆడుకుంటూ సరదాగా గడుపుతున్నారు. పెద్దలు కూడా చెరువు పక్కన చల్లని గాలితో వాకింగ్ చేస్తూ సేద తీరుతున్నారు. ఉద్యానవనాన్ని గ్రామస్తులు చక్కడా వినియోగించుకోవడం ఆనందంగా ఉందని సర్పంచి వేల్పుల పద్మకుమారి అన్నారు. గ్రామస్తుల కోసం పార్కులో మరిన్ని సదుపాయాలు కల్పిస్తామని వివరించారు.

వైభవంగా గోదాకృష్ణుల కల్యాణం

నందిగామ: రామకోటి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని సీతారామాంజనేయస్వామి వారి ఆలయంలో గోదాకృష్ణుల కల్యాణాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష పూజలు చేశారు. సాయంత్రం సమయంలో పలు ఆధ్యాత్మిక ప్రవచన, సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

కీసర(కంచికచర్ల) : మండలంలోని కీసర మున్నేటి సమీపంలో ముత్యాలమ్మతల్లి నూతన ఆలయ ప్రతిష్ఠాకార్యక్రమంలో భాగంగా బుధవారం యాగశాలలో వేద పండితులు వేదస్వస్తి, గోపూజ, మంటపార్చనలు, అనుష్టానములు, పాశుపత రుద్రహోమము వంటి పూజలు నిర్వహించారు. సాయంత్రం చండీ సప్తశతి హోమాలు, విగ్రహములకు క్షీరాధివాసము, ధాన్యధివాసము, నీరాజన మంత్ర పుష్పములు చేశారు.

ఘనంగా ప్రతిష్ఠా మహోత్సవాలు



లింగగూడెం(పెనుగంచిప్రోలు): గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీజగదాంబ(మేరీమా అమ్మవారు)ఆలయ, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటిరోజు గోపూజ, యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వరుని పూజ, సాయంత్రం యంత్రములు, విగ్రహములకు జలాధివాసం, శాంతి పూజలు నిర్వహించారు. ఈనెల 21న మహిళలచే అష్టలక్ష్మీ కుంకుమార్చన, 22న ఉదయం గం.8.34 నిముషాలకు విగ్రహ, ఆలయ, యంత్ర, శిఖర ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాలను ఖమ్మం జిల్లా, కొత్తలంకపల్లికి చెందిన గాయత్రీ ఆశ్రమ నిర్వాహకులు రామడుగు విక్రమాచార్యులు నిర్వహిస్తున్నారని వివరించారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

గట్టుభీమవరం(వత్సవాయి) : జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. చందర్లపాడు మండలం పెద్దవరం గ్రామానికి చెందిన షేక్ నాగుల్‌మీరా వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై జగ్గయ్యపేట వచ్చాడు. అక్కడ పనులను ముగించుకుని తిరుగు ప్రయాణంలో టోల్‌ప్లాజా సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. అదే సమయంలో వెనకనే వస్తున్న లారీ కిందపడిన నాగుల్‌మీరా కాళ్లపై నుంచి వెళ్లింది. ఈ ఘటనలో నాగుల్‌మీరా ఒక కాలు పూర్తిగా తెగిపోయి పక్కన పడింది. 108 వాహనంలో క్షతగాత్రుని జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. ఘటనపై ఎస్ఐ బి.అభిమన్యు కేసు నమోదు చేశారు.

చిన్నారుల సంరక్షణపై అవగాహన



ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, ఏడునెలల నుంచి మూడేళ్లలోపు పిల్లల ఉన్న తల్లిదండ్రులకు చిన్నారుల 1000 రోజుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సిబ్బంది మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతోపాటు ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా బిడ్డ తగిన బరువుతో పుడుతుందని వారికి అవగాహన కల్పించారు. ఏడో నెలలు పైబడిన చిన్నారులకు అదనపు ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం వెంకట్రావమ్మ, ఎంఎస్‌కె నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, జ్యోతి, నిర్మలారాణి తదితరులు పాల్గొన్నారు.

పేటకు వరంగా డయాలసిస్ సెంటర్

- విజయవాడ తర్వాత జగ్గయ్యపేటలోనే ఈ సదుపాయం
- విప్ ఉదయభాను కృషితో రూ.2కోట్లతో ఏర్పాటు..
- నాలుగేళ్లుగా 13వేలకు పైగా డయాలసిస్‌లు
- మూడు జిల్లాల నుంచి పేషంట్లు
- పేషంట్లకు తగ్గిన వ్యయప్రయాసలు



పేట డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్న కిడ్నీ పేషంట్లు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలోని ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్ కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారికి ఎనలేని సేవలందిస్తోంది. జీవనశైలి, వంశపారంపర్యం, ఆరోగ్యం విషయంలో తగిన జాగ్రత్తలు పాటించకపోవడం కారణాలతో పలువురు కిడ్నీ వ్యాధుల బారినపడుతూ తీవ్ర అవస్థలుపడుతున్నారు. కిడ్నీ వ్యాధికి అందించే వైద్యం ఖరీదైనది కావడంతోపాటు గతంలో స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో జగ్గయ్యపేట ప్రాంతంలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎన్నో ఇబ్బందులుపడేవారు. ఈ ఇబ్బందులను గమనించిన జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కిడ్నీ వ్యాధిగ్రస్తులకు అండగా ఉండేందుకు చర్యలు చేపట్టి పేటప్రాంతంలోని ఆయా ఫ్యాక్టరీల యాజమాన్యాలతో మాట్లాడారు.

రూ.2కోట్లతో డయాలసిస్ సెంటర్..

విప్ ఉదయభాను విజ్ఞప్తి మేరకు పట్టణ సమీపంలోని ఇప్పుడు కోహెన్స్ లైఫ్ సైన్స్‌గా పిలువబడే రాకెమ్ ఫార్మా లిమిటెడ్ వారు తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సీఎస్ఆర్)నిధుల ద్వారా రూ.2కోట్లను కేటాయించారు. దీంతో పేట ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్ సెంటర్ భవన నిర్మాణం, డయాలసిస్ మిషన్లు, పరికరాలను ఏర్పాటు చేశారు. 2020 ఫిబ్రవరి 16వ తేదీన ఈ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించి పేషంట్లకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఈ డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్రప్రభుత్వం, ఆపోలో సంస్థ భాగస్వామ్యంలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం జీతభత్యాలు అందిస్తోంది. పేషంట్లకు మందులను కూడా పంపిణీ చేస్తోంది.

ఇది కదా.. అభివృద్ధి



పేట ప్రభుత్వాస్పత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ సెంటర్

పేదల పాలిట సంజీవని ఈ కేంద్రం..

కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకునే పేషంట్లలో వారి ఆరోగ్య పరిస్థితి ఆధారంగా వారానికి ఒకసారి నుంచి మూడుసార్లు వరకు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. డయాలసిస్ మిషన్లు మనిషి శరీరంలోని 6,7 లీటర్ల రక్తాన్ని అంతా ఒక వైపునుంచి నిముషానికి 250 ఎంఎల్ చొప్పున బయటకు తీసి శుభ్రం చేస్తూ..మరొక వైపు నుంచి శుభ్రం చేసిన రక్తాన్ని శరీరంలోకి పంపుతాయి. హీమో డయాలసిస్ థెరపిగా పిలిచే ఈ ప్రక్రియకు సుమారు 4 గంటలు సమయం, 160 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. ఒక్కసారి డయాలసిస్ చేసుకోవాలంటే రూ.3వేల వరకు ఖర్చవుతుంది. అదేవిధంగా రూ1000 వ్యయంతో వారానికి ఒక బ్లడ్ ఇంజక్షన్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా డయాలసిస్‌కు నెలకు ఒక్కో పేషంటుకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.35వేల వరకు ఖర్చుచేయక తప్పని పరిస్థితి. పేదలకు ఈ మొత్తాన్ని ఏమాత్రం భరించలేదు. ఇలాంటి పరిస్థితుల్లో జగ్గయ్యపేటలోని డయాలసిస్ కేంద్రం ద్వారా ప్రభుత్వం ఉచితంగా డయాలసిస్ సేవలు అందిస్తూ పేదల పాలిట సంజీవనిలా మారింది.

మూడు జిల్లాల నుంచి పేషంట్లు..

జిల్లాలో విజయవాడ తర్వాత జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలోనే ఉచిత కిడ్నీ డయాలసిస్ సెంటర్ ఉండటంతో జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లోని కిడ్నీ పేషంట్లతోపాటు ముక్త్యాల వద్ద కృష్ణానది ఆవతల ఉన్న గుంటూరుజిల్లా, తెలంగాణాలోని ఖమ్మం, నల్గొండజిల్లా వాసులకు కూడా వైద్యసేవలందిస్తోంది. ఉదయం ఐదు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటలకు నడిచే ఈ కేంద్రంలో 14 డయాలసిస్ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ రోజుకు 40 మందికి డయాలసిస్ చేసే సామర్థ్యం ఉండగా ఒక డ్యూటీ మెడికల్ ఆఫీసర్(డీఎంవో), నెఫ్రాలజిస్ట్, ఒక క్లినికల్ మేనేజర్, 12మంది స్టాఫ్‌తో కూడిన బృందం మూడు షిఫ్ట్‌లుగా పనిచేస్తోంది. ప్రస్తుతం 90మంది పేషంట్లు ఉన్నారు. ఈకేంద్రం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు వందలాది మంది పేషంట్లు వైద్యసేవలు పొందారు. ప్రస్తుతం 90మందికి పేషంట్లకు డయాలసిస్ చేయించుకుంటుండగా, ఈ సెంటర్ ఏర్పాటు చేసినప్పటి నుంచి పేషంట్లందరికీ కలిపి 13వేలకుపైగా డయాలసిస్‌లు చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇలా ఎంతో వ్యయప్రయాసలతో కూడిన కిడ్నీ వైద్యాన్ని జగ్గయ్యపేటలో అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కృషిని పేషంట్లతోపాటు వారి కుటుంబసభ్యులు, ఈ ప్రాంత ప్రజలు అభినందిస్తున్నారు.

మాలాంటి పేదలకు ఎంతో మేలు..



కూలి పనులు చేసుకుని బతికే నేను నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ జగ్గయ్యపేట డయాలసిస్ సెంటర్‌లో డయాలసిస్ చేయించుకుంటున్నా. ఈ కేంద్రం ఏర్పాటుతో మాలాంటి పేదలకు ఎంతో మేలు చేకూరింది. కిడ్నీ వ్యాధి కారణంగా పనులు లేక ఇబ్బందిపడుతున్న నాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతినెలా రూ.10వేలను పింఛన్‌గా అందిస్తూ నా కుటుంబాన్ని ఆదుకుంటోంది.

– పాపగంటి బాబురావు, వత్సవాయి గ్రామం

ఉదయభానుకు రుణపడి ఉంటాం..



నాకు పెళ్లయి మూడేళ్లయింది. ఏడాదిగా కిడ్నీవ్యాధితో బాధపడుతున్నాను. నాభర్త లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ప్రైవేట్‌గా వైద్యం తీసుకునే స్థోమత లేదు. జగ్గయ్యపేటలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుతో విజయవాడ కాకుండా ఇక్కడే వైద్యం పొందుతున్నా. డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు కృషిచేసిన ఎమ్మెల్యే ఉదయభానుకు మాలాంటి పేదలు ఎంతో రుణపడి ఉంటారు.

– మీసాల అనిత, కీసర,

కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు..



ఈ ప్రాంతంలోని కిడ్నా వ్యాధిగ్రస్తులకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఈ డయాలసిస్ సెంటర్‌లో పనిచేసే సిబ్బంది అంతా ప్రత్యేక శిక్షణ పొందారు. అపోలో వారి నిర్వహణలో కొనసాగుతున్న ఈ కేంద్రంలో తొలుత 10మిషన్లతో పేషంట్లకు వైద్యసేవలు ప్రారంభించారు. పేషంట్ల సంఖ్య పెరగడంతో ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితో మరో నాలుగు మిషన్లు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం రోజుకు 35 నుంచి 40మంది పేషంట్లకు డయాలసిస్ చేస్తున్నాము.

– డాక్టర్ శ్రీజ, డీఎంవో, డయాలసిస్ సెంటర్

పేదలను ఆదుకునేందుకే..



జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గవ్యాప్తంగా ఎంతో మంది కిడ్నీవ్యాధితో బాధపడుతూ సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్య చేయించుకునే స్థోమత లేక ఇబ్బందిపడుతున్నారు. ఈ వ్యాధి బారినపడి పేదలు కళ్లముందే మృత్యువాత పడుతుండటాన్ని చూడలేకపోయాను. పేదలను ఆదుకునేందుకు కోహెన్స్ సంస్థను ఒప్పించి, సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో పేట వైద్యశాలలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేయించాను.

– సామినేని ఉదయభాను, జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్

మరోమారు అండగా ఉండండి

ప్రజలకు ఎమ్మెల్సీ వినతి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్

నందిగామ టౌన్: గత ఎన్నికలలో మాదిరిగా ప్రజలు రానున్న ఎన్నికలలో సైతం అండగా ఉండి మరోమారు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావును నందిగామ ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నూర్‌బాషా సంఘ నాయకులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ గత ఎన్నికలలో అండగా నిలిచి మద్దతు పలికారని తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. ముఖ్యంగా నందిగామ పట్టణాన్ని అభివృద్ధి చేయడంతోపాటు కులమతాలు, పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో అర్హత కలిగిన ప్రతిఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించామని గుర్తుచేశారు. అన్నివర్గాలకు తమ వంతుగా అండగా నిలిచామని, రానున్న ఎన్నికలలో సైతం మద్దతు పలికి మరోమారు అవకాశం కల్పించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షేక్ మీరా, దాదాహుస్సేన్, బాషా, అల్లిబాబు, మీరా, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.35లక్షలతో ఆలయాల నిర్మాణం



పెంట్యాలవారిగూడెంలో నిర్మించిన ఆలయాలు

పెంట్యాలవారిగూడెం(వత్సవాయి): మండలంలోని పెంట్యాలవారిగూడెంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ.35లక్షలతో చేపట్టిన శ్రీ దాసాంజనేయస్వామి, రామాలయ నిర్మాణాలు పూర్తయ్యాయి. గతంలో ఉన్న ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో సర్పంచి వడ్డే పరమయ్య తదితరులు చొరవ తీసుకుని ఆలయ పునర్నిర్మాణం చేయాలని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానును కోరారు. దీంతో ఆయన స్పందించి దేవాదాయశాఖ అధికారులతో మాట్లాడి సీజీఎఫ్ నిధులు రూ.23.50 లక్షలు విడుదల చేయించగా గ్రామస్తులు మరో రూ 11.50 లక్షలను కాంట్రిబ్యూషన్‌గా చెల్లించారు. ఈ నిధులతో దాసాంజనేయస్వామి ఆలయంతోపాటు రామాలయాన్ని కూడా నిర్మించారు. ఏప్రిల్ మూడోతేదీన ఆలయాల్లో విగ్రహాల ప్రతిష్ఠకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

సీఐ ఆధ్వర్యంలో గ్రామాల్లో పోలీసు కవాతు



కంచికచర్ల మండలం కీసరలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

కంచికచర్ల : త్వరలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో నందిగామ రూరల్ సర్కిల్ సీఐ పీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండలంలోని కీసర, గండేపల్లి, పెండ్యాల గ్రామాల్లో పోలీసులు బుధవారం కవాతు నిర్వహించారు. పోలీసులు, సాయుధబలగాలు గ్రామాల్లో కలియ తిరిగారు. ఈసందర్భంగా సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వారికి ధైర్యం కల్పించేందుకు కవాతు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎస్ఐలు పీవీఎస్ సుబ్రహ్మణ్యం, హైమావతి, కానిస్టేబుళ్లు, సాయుధ బలగాల పోలీసులు పాల్గొన్నారు.

భవిష్యత్తు అంతా నానో టెక్నాలజీదే

సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ బీఎల్వీ ప్రసాద్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బీఎల్వీ ప్రసాద్, పక్కన డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్, టీఎస్ కృష్ణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):భవిష్యత్తు అంతా నానో టెక్నాలజీదేనని, ఈ టెక్నాలజీ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు కూడా అపారంగా ఉన్నాయని బెంగళూరులోని సెంటర్ ఫర్ నానో అండ్ సాఫ్ట్ మేటర్ సైన్సెస్ డైరెక్టర్ బీఎల్వీ ప్రసాద్ చెప్పారు. సిద్ధార్థ కళాశాల ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఫిజిక్స్ అండ్ కెమిస్ట్రీ మెటీరియల్ సైన్స్–ఎమర్జింగ్ ట్రెండ్స్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. అతిథిగా ప్రసాద్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ప్రతి రంగంలోనూ నానో టెక్నాలజీ అవసరం ఉందన్నారు. ఇప్పటికే నానో టెక్నాలజీ ద్వారా పలు రంగాల్లో అభివృద్ధి సాధించామని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని మార్పులు రానున్నాయని తెలిపారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు కూడా అపారంగా ఉన్నాయని పేర్కొన్నారు. సృజనాత్మకతను పెంచుకోవడం ద్వారా యువత వాటిని అందిపుచ్చుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ టాటా నరసింగరావు మరో అతిథిగా హాజరై మాట్లాడారు. నానో టెక్నాలజీలో ప్రతి రంగంలోనూ ఎంతో అవసరమన్నారు. యువత ఈ రంగంపై ఆసక్తి చూపితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కళాశాల డీన్ రాజేష్ సీ.జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు మాట్లాడుతూ నానో టెక్నాలజీ రాకతో మనిషి జీవనం చాలా సౌకర్యవంతంగా మారిందన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టీఎస్ కృష్ణ మాట్లాడుతూ భౌతిక, రసాయన శాస్త్రాల్లో వచ్చే మార్పులకు నానో టెక్నాలజీ ఏవిధంగా ఉపయోగపడుతుందనే అంశాల గురించి వివరించారు. వివిధ కళాశాల నుంచి విదార్థులతో పాటుగా అధ్యాపకులు పాల్గొన్నారు. భౌతిక శాస్త్ర అధ్యాపకులు ఎస్.రాజశేఖర్, ముస్సారీన్, జె.పాండురంగారావు, ఎస్.విజయకృష్ణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ మనోరంజని, డాక్టర్ డేవిడ్ రాజు, డాక్టర్ సత్యదేవ్, డాక్టర్ పీటీఎస్ఆర్‌కే.ప్రసాదరావు, విశాలాక్ష్మి, ఈ.నాగార్జునబాబు పాల్గొన్నారు.

లెప్రా సొసైటీ సేవల పరిశీలన



సూపరిండెంటెంట్ డాక్టర్ హరీష్‌తో మాట్లాడుతున్న యూకే బృందం

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పరిసర ప్రాంతంలో కుష్ఠు, బోదకాలు వ్యాధిగ్రస్తులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థ లెప్రా సొసైటీ ద్వారా అమలుచేస్తున్న ఆయా సంక్షేమ కార్యక్రమాలను లెప్రా యూకే చైర్‌పర్సన్ సుజానే, ఫండ్ రైజింగ్ మేనేజర్ క్లైర్ బృందం బుధవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు పలువురు లబ్ధిదారులను కలిసి లెప్రా సొసైటీ ద్వారా పొందిన సేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వాస్పత్రిని సందర్శించి సీహెచ్‌సీ సూపరిండెంటెంట్ ఆళ్ల హరీష్, డాక్టర్ నాగరాణితో కలిసి కుష్ఠువ్యాధి, బోదకాలు వ్యాధిగ్రస్తులకు సీహెచ్‌సీ ద్వారా అందుతున్న సేవలు, క్యాంపులు, సంక్షేమ, సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. లెప్రా సొసైటీ ప్రాజెక్టు కోఆర్డినేటర్ మామిడి రాధిక, ప్రాజెక్టు అసోసియేట్ అబ్దుల్ వాహిద్ బాషా, శ్రేయస్సు సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నెమలి(గంపలగూడెం): ఈనెల 23వ తేదీ నుంచి మండలంలోని నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆరురోజుల పాటు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఏ డీసీపీ కనకరాజు (ఎస్‌బీ), విజయవాడ రూరల్ ఏడీసీపీ బి.పార్థసారథి గ్రామంలో పర్యటించి ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈనెల 25వ తేదీన జరుగనున్న స్వామి కల్యాణ మహోత్సవానికి అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆలయ సహాయ కమిషనర్ ఎన్.వెంకట సాంబశివరావుకు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తాగునీటి సరఫరా, విద్యుద్దీకరణ, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాలపై చర్చించారు. కాగా కనకరాజు, పార్థసారథిలు ఈసందర్భంగా వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు ఆశీర్వదించారు. ఆలయ కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, తిరువూరు సీఐ నబీ, ఎస్ఐ ఎస్ శ్రీను, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద భద్రత కట్టుదిట్టం



గరికపాడు చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గరికపాడు(జగ్గయ్యపేట):సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో తెలంగాణ నుంచి వస్తున్న ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ప్రత్యేక పోలీస్ బలగాలు చెక్‌పోస్టు వద్ద బృందాలుగా ఏర్పడి నగదు, మద్యం, గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈసందర్భంగా ఈ భద్రతా బృందాలతో సీఐ జానకిరామ్ బుధవారం మాట్లాడారు. పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మద్యం, నగదు పట్టుబడితే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహించకుండా, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

వార్డు ఇన్‌చార్జ్‌లుగా ముువ్వల, నల్లాని



ముువ్వల శ్రీనివాసరావు



నల్లాని కొండలరావు

నందిగామ టౌన్: రానున్న ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పట్టణంలోని 4, 13వ వార్డుల నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం రాత్రి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ నాలుగో వార్డుకు ముువ్వల శ్రీనివాసరావు, 13వ వార్డుకు నల్లాని కొండలరావులను ఇన్‌చార్జ్‌లుగా నియమించినట్లు తెలిపారు. ఆయా వార్డుల్లోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని పార్టీ విజయానికి కృషి చేయాలని వారికి సూచించారు. అనంతరం వారిని బూత్‌కమిటీ సభ్యులు అభినందించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 18వ వార్డు అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక తొర్రగుంటపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం పోషణ్ పక్వాడ పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. వైద్యసిబ్బంది పాల్గొని గర్భిణీలు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. కమ్యూనిటీ బేస్ట్ ఈవెంట్ ప్రోగ్రాంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వాస్పత్రి డాక్టర్లు హరీష్, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్త దుడకా సీతామహాలక్ష్మి, ఏఎన్ఎం షేక్ షాహీరాబేగం, ఆశవర్కర్లు సిరాజున్నీసా, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఏసుక్రీస్తుకు గ్రామోత్సవం



వీరులపాడు: మానవాళిని రక్షించేందుకే ప్రభువు ఏసుక్రీస్తు పునరుద్ధానుడయ్యారని రెవ. ఫాదర్ సాలే వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బోడవాడ, జమ్మవరం గ్రామాల్లోని పరిశుద్ధ లూర్దుమాత 75వ వార్షిక మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భ ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పాప స్వభావాలను విడిచిపెట్టి దేవుని చూపిన మార్గంలో నడుచుకోవాలన్నారు. మనుషుల పాప విమోచనకు ప్రభువు ఏసుక్రీస్తు సిలువపై రక్తాన్ని చిందించారని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమైనవని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆయన సూచించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై క్రీస్తును ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో రెవ. ఫాదర్లు నీలూరి మరియదాసు, తంబి, ఎంపీటీసీ సభ్యుడు యాదాల సుజాత, గ్రామనాయకులు యాదాల దాసు, కొనకాల సాయికుమార్, కర్లరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

55 మందికి వైద్యపరీక్షలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 7వ సచివాలయం పరిధిలోని స్థానిక తొర్రగుంటపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా రెండోవిడత వైద్యశిబిరం నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి సూపరిండెంటెంట్ హరీష్, వైద్యులు అరుణ, అనూష, శేషుకుమారి పాల్గొని 55 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, మున్సిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.